RNI:TS-28-0030298

తెలంగాణ డైలీ న్యూస్

ప్రజల గుండె చప్పుడు

తెలుగు దినపత్రిక

telanganadailynews.in

epaper.tgdailynews.com

సంపుటి : 01 సంచిక : 274 ఆదివారం, అక్టోబర్ 25, 2026 , పేజీలు - 06 వెల : 3/-

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రా వ్యాప్తంగా వెలువడుతున్న తెలంగాణ డైలి న్యూస్ జాతీయ దినపత్రికలో, బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

9553111142

'రూ.10వేలకోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం

ర్యాలీని వాయిదా వేసుకోండి'



న్యూ ఢిల్లీ : దీపావళి పండుగకు ముందు దిల్లీలో నిర్వహించనున్న ఇండియా కూటమి ర్యాలీని వాయిదా వేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) విజ్ఞప్తి చేసింది. నవంబర్ 1న రాంలీలా మైదాన్‌లో జరగనున్న ఈ సభ వల్ల పండుగ సీజన్‌లో వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలగవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. ర్యాలీ కారణంగా సుమారు రూ.10 వేల కోట్ల వ్యాపారానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. నవంబర్ 10 తర్వాత సభ నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని కోరింది. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ వచ్చే నెల 1న రాంలీలా మైదాన్‌లో ఇండియా కూటమి భారీ ర్యాలీకి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే రాహుల్‌కు సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ లేఖ రాశారు.

ఓటు తొలగించారని ఒక్కరూ

ఫిర్యాదు చేయలేదు

● 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' పేరుతో పాదయాత్రలకు సిద్ధమైన బీజేపీ

హైదరాబాద్, అక్టోబరు 24 : తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. తమ ఓటును తొలగించారని రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయలేదని, కానీ కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లను తొలగించి ఎన్నికల్లో గెలవాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే.



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై మంత్రి పొంగులేటి

కీలక ప్రకటన



హైదరాబాద్, అక్టోబరు 24 : జర్నలిస్టులకు ఇళ్లస్థలాలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (శనివారం) కీలక ప్రకటన చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల సాకారం చేస్తామని.. వారికి ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. న్యాయపరమైన చిక్కులు లేని విధంగా స్థలాలను కేటాయిస్తామని స్పష్టం చేశారు. నివాసయోగ్యమైన ప్రాంతం లో ఇళ్లస్థలాలు అందిస్తామని చెప్పుకొచ్చారు. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఇళ్లస్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.సీఎం రేవంత్‌రెడ్డితో పలుమార్లు ఈ విషయంపై చర్చించామని మంత్రి పొంగులేటి తెలిపారు.

కమీషన్ల కోసం కక్కుర్తిపడి

కాళేశ్వరం కట్టారు

ముఖ్యమంత్రి అసమర్థత వల్లే రాష్ట్రంలో కరవు: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



హైదరాబాద్, అక్టోబర్ 24:

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ పార్టీ పదేపదే అబద్ధాలు చెబుతోందని నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో నీటిపారుదల వ్యవస్థను గత ప్రభుత్వం నాశనం చేసిందని మంత్రి దుయ్యబట్టారు.'బీఆర్ఎస్ కమీషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణానికి పూనుకుంది. ఉద్దేశపూర్వకంగానే ప్రాణ హిత చేవెళ్ల నుంచి మేడిగడ్డకు మార్చా రు. ప్రాజెక్ట్ వ్యయాన్ని 37వేల కోట్ల నుంచి లక్షన్నర కోట్లకు పెంచారు. వాళ్ళు కట్టిన ప్రాజెక్ట్ వాళ్ల హయాంలోనే కూలి పోయినా.. ఇంకా సిగ్గులేకుండా మాట్లా డుతున్నారు. సీతారామ ప్రాజెక్ట్ రీ డిజైన్ పేరిట 2వేల కోట్ల ప్రాజెక్ట్ వ్యయాన్ని 20 వేల కోట్లకు పెంచారు. అధిక వ్యయంతో నిర్మించినా సరే.. కనీసం ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? జూరాల, దేవాదుల, పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్బీసీ పూర్తి చేసి ఉంటే ఈ రోజు ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై ఉండేది కాదు. రాష్ట్రంలో నీటి పారుదల వ్యవస్థను కేసీఆర్ అండ్ కంపెనీ సర్వ నాశనం చేసింది. అబద్ధాలు చెబుతూ.. ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు పేర్ల ముందు జోసెఫ్ గోబెల్స్ అని పెట్టుకుంటే బాగుంటుంది' అంటూ మంత్రి ఉత్తమ్ తీవ్రంగా విమర్శించారు.ముఖ్యమంత్రి అసమర్థత వల్లే రాష్ట్ర ప్రజలు తాగు, సాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కేపీ వివేకానంద మండిపడ్డారు.

● సోమవారం సీఎం రేవంత్ రెడ్డి ముంబయి వెళ్లనున్నారు.

● తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపనున్నారు.

● సీఎంతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులు వెళ్లనున్నారు.

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చలు

సోమవారం ముంబయికి సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ముంబయిలో చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ముంబయి వెళ్లనున్నారు. తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్?తో ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొనున్నారు.కేఆర్ఎంబీ సమావేశం వాయిదామరోవైపు సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. అదేరోజు ముంబయిలో మహారాష్ట్ర సీఎంతో రేవంత్?రెడ్డి సమావేశం ఉన్నందున వాయిదా వేయాలని తెలంగాణ కోరింది. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేఆర్ఎంబీ సమావే శాన్ని వాయిదా వేశారు. సోమవారం జరగాల్సిన కృష్ణా బోర్డు సమావేశం మంగళవారానికి వాయిదా వేసింది. నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలుసాగునీటి ప్రాజెక్టులపై శుక్రవారం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశంలో భాగంగా తుమ్మిడిహెట్టిపై ప్రధానంగా చర్చించారు. 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించేందుకు అవసరమైన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను సీఎం ఆదేశించారు.గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకొనే వీల్లేదని ప్రభుత్వం భావిస్తోంది.



దామరచర్లలో గుంజకు కట్టి

కొట్టినా తప్పులేదు

● కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అడ్డం పెట్టుకుని రూ. లక్ష కోట్ల భారీ అవినీతికి కేసీఆర్ డిజైన్ చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణానికి సూత్రధారి ప్రతిమా శ్రీనివాస్ అని ఆరోపించారు.ప్రపంచంలో ఎక్కడైనా ముడిసరుకు లభించే ప్రాంతంలోనే పరిశ్రమలు స్థాపిస్తారని, కానీ కేసీఆర్ ప్రభుత్వం బొగ్గు లభించే చోట కాకుండా కృష్ణా నదీ పరీవాహక ప్రాంతమైన దామరచర్లలో యాదాద్రి ప్లాంట్‌ను నిర్మించిందని విమర్శించారు. దీనివల్ల రూ.28 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు వ్యయం రూ.37,800 కోట్లకు పెరిగిందని, అంటే అదనంగా రూ.9,800 కోట్లు భారం పడిందని వివరించారు.40 ఏళ్లలో రూ. లక్ష కోట్ల అవినీతి కోసమే ఈ ప్లాంట్‌ను కేసీఆర్ డిజైన్ చేశారని రేవంత్ ఆరోపించారు.



నా చిన్నతనంలో అన్యాయాలను చూడలేకే

నక్సలైట్ అయ్యా

నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నా.. ప్రజలతోనే ఉండాలనేది నా సిద్ధాంతం...



హైదరాబాద్, అక్టోబరు 24:

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. స్త్రీల రాజకీయ ఎదుగుదలలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలకు భయపడకుండా వాటిని అధిగమించి వనితలు ఉన్నత స్థానాల్లోకి చేరుకోవాలని ఆకాంక్షించారు. (శనివారం) హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు.. మహి ళా రాజకీయ నాయకత్వం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ గురుదీప్ సింగ్ సత్వాల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోటా నీలిమ, పెద్దఎత్తున మహిళ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు.'నా చిన్నతనంలో నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. ఆకలి బాధలు చూశాను.. అయినప్పటికీ అన్ని కష్టాలను ఎదుర్కొని.. నేడు ఈ స్థాయికి చేరుకున్నాను. ములుగు ప్రజల ఆశీర్వాదం, కాంగ్రెస్ పెద్దల అండదండలతో పంచాయతీరాజ్ శాఖకు మంత్రి కాగలిగాను

స్థానిక ఎన్నికలను ఆపేందుకు

5వి పిటిషన్లు.



అమరావతి, అక్టోబర్ 24:

ప్రభుత్వ పనితీరుపైనే ప్రజలు తీర్పు ఆధారపడి ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. (శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. రౌడీయిజం, నేరాలు చేసే వారిని ఎవరు హర్షించరన్నారు. పదేళ్లుగా రాష్ట్రంలో శాంతిభద్రతలు వెళ్లాయని తెలిపారు. 'ఉమ్మడి రాష్ట్రంలో నక్సలిజాన్ని నేను కంట్రోల్ చేశా.. నా లైఫ్‌ను కూడా రిస్క్ పెట్టి మరీ చేశాను' అని వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో నెల రోజుల పాటు కర్ఫ్యూ ఉందని.. అప్పట్లో తాను సీఎంగా ఉన్నప్పుడు పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. అప్పటి నుంచి హైదరాబాద్ ప్రశాంతంగా ఉందని చెప్పుకొచ్చారు. ఏపీని పునర్నిర్మించాం.. బ్రాండ్ ఇమేజ్ పెంచాం ఎప్పటికప్పుడు కొత్త సమస్యలు వస్తే అధిగమించి వెళ్లామని ముఖ్యమంత్రి అన్నారు. 2019 నుంచి 2024 వరకు ఏపీలో అరాచకం రాజ్యమేలిందని సీఎం విమర్శించారు.

ఆ పరీక్షను వాయిదా వేయాలి

● సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ

● ఆ రెండు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలి

● నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయొద్దు..

హైదరాబాద్, అక్టోబరు 24 :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు (శనివారం) బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయొద్దని సూచించారు. నవంబర్ 6వ తేదీన జరగనున్న టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షను వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్ జీజు, టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షలు ఒకే తేదీలో ఉండటంతో వేలాది మంది తెలంగాణ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో గ్రూప్ జీజు పరీక్ష రాసే అభ్యర్థులు వెంటనే తెలంగాణకు తిరిగివచ్చి ఏఈఈ పరీక్ష రాయడం ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు.ఏళ్ల తరబడి కష్టపడి సిద్ధమైన రెండు పోటీ పరీక్షల్లో నిరుద్యోగ యువత ఒకదాన్ని వదులుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. పరీక్షల తేదీలు మార్చాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా టీజీపీఎస్సీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పరీక్షల తేదీలను పున: పరిశీలించాలని అక్టోబర్ 14వ తేదీనే టీజీపీఎస్సీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. నిరుద్యోగ యువత రెండు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు.ఒడిశా, బిహార్ వంటి రాష్ట్రాల్లో పరీక్షల తేదీలు మార్చినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదు? అని హరీశ్‌రావు నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్.. భేషజాలకు పోయి నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయొద్దని హితవు పలికారు.



సిద్దిపేటలో దారుణం బాలికపై

సామూహిక అత్యాచారం

ఏడుగురి అరెస్ట్



తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల బాలికపై ఏడుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు మైనర్లు సహా నిందితులందరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం..

దసరా పండుగ రోజున బాలిక తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను గమనించిన నిందితులు, ఆమెను కిడ్నాప్ చేసి సమీపంలోని మరో గ్రామానికి తీసుకెళ్లారు.

అల్లూరి జిల్లాలో మైనింగ్ చేస్తుండగా పేలుడు

- ఏడుగురు మృతి




అల్లూరి జిల్లా: అల్లూరి జిల్లాలోని అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పీచుమామిడి వద్ద రోడ్డు పనుల కోసం బ్లాస్టింగ్ పనులు చేపట్టా రు. ఇందు కోసం జిలెటిన్ స్టిక్స్ ను అమర్చిన ప్రత్యేక పరికరాన్ని వినియోగించారు. ఈ యంత్ర ంలో డీజిల్ నింపుతుం డగా అక స్మాత్తుగా మంటలు చెలరేగి పేలు డు సంభవించింది. ఆ సమ యంలో అటువైపుగా వెళ్తున్న వా హనాలు ప్రమాదానికి గురయ్యాయి. జిలెటిన్ స్టిక్స్ పేలుడు ధాటికి రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. అక్కడున్న ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

పరిగిలో పాస్‌పోర్ట్ పోయింది.. దొరికితే సమాచారం ఇవ్వండి!

- బాధితుడు కాజా అజిమోదిన్

పరిగి, అక్టోబర్ 25 (తెలంగాణ డైలీ న్యూస్) :
వికారాబాద్ జిల్లా పరిగి పట్టణానికి చెందిన కాజా అజిమోదిన్ వ్యక్తిగత పని నిమిత్తం బయటకు వెళ్లిన సమయంలో తన పాస్‌పోర్ట్ పోగొట్టుకున్నారు. ఈ ఘటనపై ఆయన వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తన పాస్‌పోర్ట్ ఎవరికైనా లభిస్తే తక్షణమే తగిన చిరునామాకు చేరవేయాలని లేదా ఫోన్ ద్వారా సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కాజా అజిమోదిన్ 1989వ సంవత్సరంలో హజ్, ఉమ్రా నిమిత్తం మక్కా వెళ్లేందుకు ఈ పాస్‌పోర్ట్ తీసుకోవడం జరిగింది. అప్పటి నుండి ఆయన అదే పాస్‌పోర్ట్ ద్వారా అవసరమైనప్పుడు రాకపోకలు సాగిస్తున్నారు. అక్టోబర్ 16, 2026 శుక్రవారం రోజున ఆయన తన వ్యక్తిగత పని కోసం డాక్యుమెంట్ల జిరాక్స్ తీసుకువ చ్చేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ?ఆ సమయంలో పత్రాలు ఉన్న కవర్ లోనే ఆయన పాస్‌పోర్ట్ కూడా ఉంది. అయితే మార్గమధ్యంలో జిరాక్స్ సెంటర్ కు వెళ్లేసరికి ఆ కవర్ ఎక్కడో కిందపడిపోయింది. ?జిరాక్స్ సెంటర్ వద్దకు చేరుకుని చూసేసరికి కవర్ లేకపోవడంతో ఆందోళనకు గురై, వెంటనే తాను వచ్చిన దారెంబడి ఎంత వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. ఎక్కడా పాస్‌పోర్ట్ ఆచూకీ దొరకకపోవడంతో బాధితుడు వెంటనే పరిగి పోలీసు స్టేషన్ను సంప్రదించారు. పోలీసులు ఇచ్చిన సూచనల మేరకు సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది. సమాచారం



ఇవ్వవలసిన చిరునామా వివరాలు: ఈ పాస్‌పోర్ట్ ఎవరికైనా లభిస్తే పరిగి పట్టణంలోని గంజి రోడ్, ఇల్లు నెంబర్ 5-81 చిరునామాకు అందజేయాలని, లేదా కింద ఇవ్వబడిన ఫోన్



నెంబర్కు ఫోన్ చేసి సమాచారం అందించాలని బాధితుడు కాజా అజిమోదిన్ విజ్ఞప్తి చేస్తున్నారు.
బాధితుడి పేరు: కాజా అజిమోదిన్
ఫోన్ నెంబర్: 9440434082

పరిగిలో పాస్‌పోర్ట్ పోయింది.. దొరికితే సమాచారం ఇవ్వండి

- బాధితుడు మీది గడ్డ రామకృష్ణ

పరిగి, అక్టోబర్ ఇరవై ఐదు (తెలంగాణ డైలీ న్యూస్):
వ్యక్తిగత పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో పాస్‌పోర్ట్‌తో కూడిన చిన్న బ్యాగ్ పోయినట్లు బాధితుడు తెలిపారు. వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన మీదిగడ్డ రామకృష్ణ గత నెల అక్టోబర్ పద్నాలుగో తేదీ బుధవారం నాడు సాయంత్రం హైదరాబాదు నుండి పరిగి ఆర్టీసీ బస్టాండు వద్ద దిగారు. అక్కడి నుండి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న మార్గమధ్యంలో పాస్పోర్టు ఇతర ముఖ్యమైన కాగితాలు ఉన్న చిన్న బ్యాగ్ పడిపోయింది. ఇంటికి వెళ్లి పరిశీలించగా సంచె కనిపించకపోవడంతో రామకృష్ణ తాము వచ్చిన దారంట ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వెంటనే స్థానిక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడం జరిగింది. పాస్పోర్ట్ ఎవరికైనా లభిస్తే వెంటనే 9985694449 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.



ఛాయ్ టీమ్ ఆధ్వర్యంలో ఘనంగా బహుజనుల 'అలై-బలై'

- పెద్ద సంఖ్యలో హాజరైన బహుజన నాయకులు, ప్రజా సంఘాలు



పరిగి, అక్టోబర్ 25 (తెలంగాణ డైలీ న్యూస్) :
పరిగి పట్టణంలోని ఎన్‌కే కన్వెన్షన్ హాల్ వేదికగా 'పరిగి ఛాయ్ టీమ్' ఆధ్వర్యంలో పరిగి నియోజకవర్గ స్థాయి బహుజనుల అలై-బలై కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. విజయ దశమి (దసరా) పండుగను పురస్కరించుకుని బహుజనుల ఐక్యతను చాటి చెప్పేందుకే ఈ అలై-బలై కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా పలువురు బహుజన పెద్దలు తెలిపారు. రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా సమిష్టిగా మెలుగుతూ సమాజంలో సంతోషంగా జీవించాలని వారు ఆకాంక్షించారు. బహుజనుల బలోపేతం మరియు ఐక్యత కోసం అందరూ చేతులు కలపాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారందరూ ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ, జమ్మి ఆకులు ఇచ్చిపుచ్చుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకుంటూ సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిగి నియోజకవర్గానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ముఖ్య నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, ఉద్యోగ-ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలు, యువజన మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దిర్సంపల్లిలో అక్రమ మట్టి దందా...


- పగలు రాత్రి తేడా లేకుండా ప్రకృతి సంపద దోపిడీ...
- అక్రమార్కుల ఆగడాలు.. విచ్చలవిడి మట్టి తవ్వకాలు
- నిద్ర మత్తులో రెవెన్యూ యంత్రాంగం..
- అక్రమ మట్టి రవాణాపై గ్రామస్తుల ఆగ్రహం...
- జిల్లా అధికారుల స్పందించి చర్యలు తీసుకోవాలి...

దోమ, 25 (తెలంగాణ డైలీ న్యూస్) :
రెచ్చిపోతున్నా మట్టి వ్యాపారులు, అధికారుల కళ్ళు కప్పి దౌర్జన్యంగా దర్జాగా అక్రమంగా మట్టి తరలిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన భూములను లేవలు చేస్తున్నారు. ఎంత అధికారులకు తెలిసే జరుగుతుండా లేక నిబంధనలకు విరుద్ధంగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.వికారాబాద్ జిల్లా దోమ మండల దిర్సంపల్లి గ్రామంలో అక్రమ మట్టి రవాణా దందా అడ్డూఅదుపు లేకుండా, హద్దు అదుపు తప్పి సాగుతోంది. ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి, చట్టాలంటే భయం లేకుండా అక్రమార్కులు విచ్చలవిడిగా గుట్టలు, వ్యవసాయ భూములను తవ్వుతూ రూ. లక్షల్లో అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం ట్రాక్టర్ల సైరన్లతో దిర్సంపల్లి పరిసర ప్రాంతాలు మారుమోగిపోతున్నాయి. ఎలాంటి అధికారిక అనుమతులు, మైనింగ్ పర్మిషన్లు లేకపోయినా, అధికారుల కళ్లెదుటే ఈ దోపిడీ పర్వం సాగుతుండటంపై స్థానిక ప్రజలు, రైతులు తీవ్ర దిగ్భ్రాంతిని, తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. గడిసింగాపూర్ -- రంగారెడ్డిపల్లి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న సారవంతమైన వ్యవసాయ పొలాలను, అలాగే వెలస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్లు, ప్రైవేట్ వ్యక్తుల



భూములను సమాంతరం (లేవలింగ్) చేసే పేరుతో ఈ ఘోర దందా కొనసాగుతోంది. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, పొక్లెయిన్లతో గుట్టలను తవ్వి మట్టిని తరలిస్తున్నారు. ఈ అక్రమ రవాణా వల్ల ప్రధాన రహదారులు దెబ్బతిని గుంతలమయంగా మారుతుండటంతో నిత్యం వాహనదారులు, బాటసారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాల ద్వారా విపరీతమైన దుమ్ము ధూళి రేగడంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర శ్వాసకోస సమస్యలతో, ఆరోగ్య సమస్యలతో అల్లాడిపోతున్నారు.

- అధికారుల్లో మౌనం పై అనుమానాలు..
అత్యంత విచారకరమైన విషయమేమిటంటే.. ఈ మట్టి దందా అంతా మండల రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు గట్టిగా ఆరోపిస్తున్నారు. అధికారులు కనీసం ఆ వైపు వచ్చి తనిఖీలు చేసిన పాపాన పోలేదని, అక్రమార్కుల నుంచి అందుతున్న భారీ మామూళ్ల మత్తులోనే రెవెన్యూ యంత్రాంగం నిద్రపోతోందని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అండదండలు, ప్రోత్సాహం లేకపోతే ఇంత బహిరంగంగా, రోజులకు రోజులు



రాత్రింబవళ్లు అక్రమ రవాణా చేయడం సాధ్యమేనా అని గ్రామస్తులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

- దిర్సంపల్లిలో తరచూ మైనింగ్ వ్యాపారం...
గతంలో కూడా దిర్సంపల్లి గ్రామంలో ఇలాంటి అక్రమ మట్టి మైనింగ్ తరచూ జరుగుతున్నా అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెట్టడమే తప్ప, శాశ్వతంగా అడ్డుకట్ట వేసిన దాఖలాలు లేవు. అధికారుల ఈ నిర్లక్ష్య వైఖరి అక్రమార్కులకు మరింత తోడ్పాటుగా మారి, ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి కారణమవుతోంది. ప్రకృతి సంపద అయిన గుట్టలను, నిధులను నాశనం చేస్తూ తమ స్వలాభం కోసమే ఊరి సంపదను తోడేస్తుంటే మండల స్థాయి అధికారులు చేష్టలుడిగి చూడటం వెనుక అసలు రహస్యమేమిటో బహిర్గతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

- మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలి...
ఈ అక్రమ మట్టి రవాణాను తక్షణమే నిలిపివేయకపోతే చూస్తూ ఊరుకునేది లేదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ యంత్రాంగం, మైనింగ్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి దిర్సంపల్లి గ్రామంలో ప్రత్యేక బృందాలతో దాడులు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టలను, భూములను విచ్చలవిడిగా తవ్వుతూ అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయడమే కాకుండా, వారికి పరోక్షంగా సహకరిస్తున్న అధికారులపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే చర్యలు తీసుకోకపోతే మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఆందోళనలను తీవ్రతరం చేస్తామని గ్రామస్తులు, రైతులు

హెచ్చరిస్తున్నారు.

కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల విడుదలకు వేగంగా చర్యలు: సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, అక్టోబరు 24 :
కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల విడుదలకు వేగంగా చర్యలు చేపడుతున్నామని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వ్యాఖ్యానించారు. (శనివారం) కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు, నిధుల సాధనపై సీఎస్ సంజయ్ జాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మార్గనిర్దేశం చేశారు. కేంద్ర నిధుల సాధనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన పెండింగ్ ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.కేంద్ర నిధుల విడుదలకు అవసరమైన ప్రక్రియలు వేగవంతం చేయాలి...అలాగే, వ్యవసాయం నుంచి పట్టణాభివృద్ధి వరకు పలు శాఖలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్షించారు. కేంద్ర నిధుల విడుదలకు అవసరమైన ప్రక్రియలు వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వ్యయ వివరాల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్ఎన్ఏ) ఖాతాల ముగింపుపై సమీక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి రివ్యూ, డ్యాష్‌బోర్డులో నిధుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయా శాఖల కార్యదర్శులు తక్షణమే సమీక్షలు నిర్వహించాలని హుకుం జారీ చేశారు.కేంద్రానికి డీఓ లేఖలు పంపిస్తాం..కేంద్ర అదనపు కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు. అవసరమైతే కేంద్రానికి డీఓ లేఖలు పంపిస్తామని పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్ర కార్యదర్శులతో నేరుగా మాట్లాడతానని చెప్పుకొచ్చారు. తెలంగాణకు రావాల్సిన నిధుల విడుదలకు కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర నిధులు కీలకమని పేర్కొన్నారు. నిధుల సాధనలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాలని సీఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం చేశారు.

కొత్తపల్లి గోరి మండలంలో బెల్టు షాపులను అరికట్టాలి

16 గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 24 : కొత్తపల్లి గోరి మండల పరిధిలోని 16 గ్రామాల్లో అనధికారిక బెల్టు షాపులు, అధిక ధరలకు మద్యం విక్రయాలు, డోర్ డెలివరీలను అరికట్టాలని మండల ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరారు. అక్రమ మద్యం విక్రయాల వల్ల యువత, వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎక్సైజ్, పోలీసు శాఖలతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బెల్టు షాపులు, నాటుసారా కేంద్రాలను గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టి అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు.

చిన్నప్పటి నుంచే చట్టాలపై అవగాహన ఉండాలి..

- విద్యార్థులకు అవగాహన కల్పించిన సీఐ



?వికారాబాద్, అక్టోబర్ 25 (తెలంగాణ డైలీ న్యూస్) :
సాంఘికీకరణ సమాజ అవగాహన కార్యక్రమంలో భాగంగా వికారాబాద్‌లోని ప్రసిద్ధ వేదిక్ హైస్కూల్ విద్యార్థులు స్థానిక మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. విద్యార్థుల్లో చదువుతో పాటు సామాజిక స్పృహను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ విద్యా యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులను మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సాదరంగా స్వాగతించి, పోలీసుల విధులను వారికి ప్రత్యక్షంగా వివరించారు. ఈ సందర్భంగా సిఐ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ...పిల్లలు సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో, ముఖ్యంగా మహిళలు మరియు పిల్లల భద్రతను నిర్ధారించడంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకం. నేరాలను అరికట్టడంలో, పౌరులకు రక్షణ కల్పించడంలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుంది. చిన్న వయస్సు నుంచే చట్టాలపై, పోలీసుల విధ్ధులపై అవగాహన కలిగి ఉండటం వల్ల భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది. మీరందరూ బాగా చదువుకుని దేశానికి మంచి ప్రయోజకులు కావాలి" అని పిలుపునిచ్చారు.?అనంతరం పోలీస్ అధికారులు స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును, ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని రికార్డుల నిర్వహణను విద్యార్థులకు వివరంగా చూపించారు. ?ఈ సందర్శన ద్వారా విద్యార్థులలో సామాజిక బాధ్యత, ఆత్మవిశ్వాసం, శాంతిభద్రతలను కాపాడే రక్షకభటుల పట్ల గౌరవం మరింత పెరిగాయని ఉపాధ్యాయులు తెలిపారు. "విద్య అంటే కేవలం పుస్తక జ్ఞానమే కాదు... సమాజాన్ని అర్థం చేసుకోవడం" అనే సత్యానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. ?కార్ ప్రోగ్రాము చివరగా విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు సిఐ ఇతర పోలీసు సిబ్బందితో కలిసి ఉత్సాహంగా ఫోటోలు దిగి, తమ ఆసందాన్ని పంచుకున్నారు. ఈ ఫార్మాట్ వార్త చదవడానికి ఆసక్తికరంగా ఉండటమే కాకుండా, ప్రజలకు పాఠకులకు మరింత స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది.

పోలీసు అమరవీరుల స్మారకార్థం రక్తదాన శిబిరం

రక్తదానం చేసిన వస్కుల నాగరాజు





హనుమకొండ, అక్టోబర్ 24 పోలీసు అమరవీరుల స్మారకార్థం శనివారం కాజీపేట మండలం మడికొండలోని శ్రీ రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. హనుమకొండ రెడ్‌క్రాస్ సహకారంతో మడికొండ ఎస్‌హెచ్ఓ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా 46వ డివిజన్ తాజా మాజీ అధ్యక్షుడు వస్కుల నాగరాజు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు.

కాంగ్రెస్ సర్కార్‌ది రాక్షస పాలన.

- జెండాలు మోసి మోసపోయాం..
- తెలంగాణ యువతకు కేటీఆరే సరైన నాయకుడు..
- కాంగ్రెస్‌పై భార్గవ్ దేశ్‌పాండే తీవ్ర విమర్శలు..
- బిఆర్ఎస్ లో చేరనున్న ఆదిలాబాద్ నేత

హైదరాబాద్, అక్టోబర్ 25 (తెలంగాణ డైలీ న్యూస్) :
కాంగ్రెస్ పార్టీ తీరుపై మాజీ ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఆదిలాబాద్ నాయకుడు భార్గవ్ దేశ్‌పాండే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం, అధికారంలోకి రావడం కోసం ఎంతో కష్టపడి జెండాలు మోశామని, అయితే గత మూడేళ్లుగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

- కాంగ్రెస్ రాక్షస పాలనపై మండిపాటు..
ఆనాడు కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రతిపక్షంలో ఉండి వీధిపోరాటాలు చేశామని ఆయన గుర్తు చేసుకున్నారు. కానీ సొంత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండు సంవత్సరాల పది నెలలుగా (మూడేళ్లుగా) రాష్ట్రంలో సాగుతున్న పరిస్థితులు, ప్రజలకు పడుతున్న కష్టాలు చూస్తుంటే తీవ్ర నిరాశ ఎదురైందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి తీవ్రంగా కుంటుపడిందని, ప్రజల సుఖసంతోషాలు దూరమ



య్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

- కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష:
పదేళ్ల కేసీఆర్ పాలనను, ప్రస్తుత పాలనను ప్రజలు స్పష్టంగా పోల్చి చూస్తున్నారని భార్గవ్ దేశ్‌పాండే వ్యాఖ్యానించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం, ముఖ్యంగా హైదరాబాద్ నగరం ఎంతో అద్భుతంగా అభివృద్ధి చెందిందని కొనియాడారు. "ఆరోజు హైదరాబాద్ ఎలా ఉంది.. ఈరోజు ఎలా ఉంది, ఆరోజు తెలంగాణ రాష్ట్రం ఎలా ఉంది.. ఈరోజు తెలంగాణ రాష్ట్ర పరిస్థితి ఏంటి అనే విషయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి" అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి, ఇక్కడి ప్రజల భవిష్యత్తుకు కేసీఆర్ గారి నాయకత్వం, బిఆర్ఎస్ పాలనే శ్రీరామరక్ష అని ఆయన దృఢంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు.

- యువతకు సరైన నాయకుడు కేటీఆర్...
తెలంగాణ యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, సము చిత అభివృద్ధి కావాలని, యువత ఆలోచనలకు, ఆకాంక్షలకు తగ్గట్టుగా నడిపించగల ఏకైక నాయకుడు కేటీఆర్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కేటీఆర్ నాయకత్వంలోనే రాష్ట్ర యువతకు ప్రగతి, భవిష్యత్తు సాధ్యమవుతుందని చెప్పారు.

- భారీ సంఖ్యలో బి.ఆర్.ఎస్ పార్టీలో చేరికకు సిద్ధం...
కాంగ్రెస్ పార్టీ వైఖరితో విసిగిపోయిన యువత, విద్యార్థి నాయకులు, మద్దతుదారులు అందరం కలిసి ఒక బలమైన నిశ్చయానికి వచ్చామని భార్గవ్ దేశ్‌పాండే ప్రకటించారు. త్వరలోనే కేటీఆర్ గారి సమక్షంలో భారీ సంఖ్యలో యువతతో కలిసి బి.ఆర్.ఎస్ పార్టీలో చేరనున్నట్లు ఆయన వెల్లడించారు. కేసీఆర్, కేటీఆర్ ల నాయకత్వంలో తెలంగాణ పునర్నిర్మాణానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

కేంద్ర నిధుల దోపిడీకి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర!

- పెండింగ్ బిల్లుల పేరిట మోసపూరితంగా సంతకాల సేకరణ
- ఇందిరమ్మ ఇళ్ల నిధులను మళ్లించేందుకు పక్కా ప్రణాళిక
- అధికారుల తీరుపై మండిపడ్డ జిల్లా సర్పంచుల సంఘం

పరిగి, అక్టోబర్ 25 (తెలంగాణ డైలీ న్యూస్):
అధికార పార్టీకి ఏజెంట్లుగా మారి సర్పంచ్‌లను మోసం చేసిన మండల పరిషత్ అధికారులపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్య లు తీసుకోవాలి. ఎల్1 జాబితా ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులను ఎట్టిపరిస్థితుల్లోనూ దారిమళ్లించకుండా, నిజమైన లబ్ధిదారులకే నేరుగా అందేలా చూడాలి. ప్రజాప్రతినిధుల సంతకాలను మోసపూరితంగా సేకరించిన పత్రాలను రద్దు చేయాలని పరిగి మండల సర్పంచ్ లు డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిషత్ అధికారుల తీరు తీవ్ర దుమారాన్ని రేపుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉంటూ ప్రజలకు, ప్రజాప్రతినిధు లకు బాధ్యతాయుతంగా సేవలు అందించాల్సిన అధికారులు... అధికార కాంగ్రెస్ పార్టీకి కొమ్ముకాస్తూ, పార్టీ కార్యకర్తల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారని వికారాబాద్ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు బోయిని రాములు, పరిగి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు పి. మాణిక్యం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తోటి సర్పంచ్ రంగపూర్ సర్పంచ్ మందాకిని అరవింద్ రావు, లక్ష్మీదేవి పల్లి సర్పంచ్ హనుమయ్య, నారా యణపూర్ సర్పంచ్ సత్యనారాయ ణరెడ్డి, బర్మత్ పల్లి సర్పంచ్ విశ్వనాథ్, బసిరెడ్డిపల్లి సర్పంచ్ మొగిలిగిద్ద మంజుల శ్రీశైలం, చిట్యాల సర్పంచ్ రాజు,తొండపల్లి సర్పంచ్ గుర్రంపల్లి కృష్ణ, రంగంపల్లి సర్పంచ్ కిష్టమోని అశోక్, రాఘవపూర్ సర్పంచ్ స్రవంతి రామచందర్, ఖుదా వందపూర్ సర్పంచ్ మోడే యాదయ్య, సయ్యద్‌పల్లి సర్పంచ్ పల్లెమోని మంజుల, రూప్ ఖాన్ పెట్ సర్పంచ్ అంజిలమ్మ రామచందర్, రాపోల్ సర్పంచ్ ఎర్రం హేమలత, ఇబ్రహీంపూర్ సర్పంచ్ ఆశప్ప,లతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు అధికారుల బాధ్యతారాహిత్యం, కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిపై నిప్పులు చెరిగారు.ఈ సందర్భంగా సర్పంచులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు బోయిని రాములు మాట్లాడుతూ... గతంలో



ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన గ్రామీణ నిరుపేదలను ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగింది. ఆయా గ్రామాల్లో ఇదివరకే పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన చివరి విడత బిల్లులు రావాల్సి ఉంది. అయితే, కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు విన్న మండల పరిషత్ అధికారులు... సర్పంచ్‌లకు ఈ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయిస్తామని నమ్మబలికారు. బిల్లులు వస్తాయనే ఆశతో ఉన్న సర్పంచ్‌ల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, అబద్ధాలు చెప్పి మోసపూరితంగా వారి నుండి సంతకాలు సేకరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచ్‌లను ఈ రకంగా మోసం చేయడం అక్షమ్యమైన నేరం."

- కేంద్ర నిధుల దోపిడీకి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర.
కాంగ్రెస్ ప్రభుత్వంపై, అధికారుల తీరుపై పరిగి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు పి. మాణిక్యం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ... ?"ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులను దొడ్డిదారిన కాజేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద కుట్రకు తెరలేపింది. గతంలో ఎల్ 1 (లెవెల్-1) జాబితాలో నమోదైన ముందస్తు లిస్టుల ఆధారంగా కేంద్రం నుండి రావాల్సిన నిధులను దారిమళ్లించి, రాష్ట్ర ప్రభుత్వ ఖజానా అవసరాల కోసం



వాడుకోవాలని చూస్తున్నారు. కేంద్రం పేదల ఇళ్ల కోసం ఇచ్చే నిధులను సైతం బొక్కేసేందుకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పథకం రచించడం దుర్మార్గం. కాంగ్రెస్ నాయకుల సూచనలతో అధికారులు కుమ్మక్కై, లబ్ధిదారుల ఎంపిక నుంచి నిధుల విడుదల వరకు అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు.

- సర్పంచ్‌లను బదనాం చేసే రాజకీయ కుట్ర
అధికార పార్టీకి చెందిన నాయకులు తమకు నచ్చిన వ్యక్తులను, అక్రమ మార్గాల్లో లబ్ధిదారులుగా ఎన్నుకుంటున్నారని మండిపడ్డారు. అలా చేసిన అక్రమాల నిందను గ్రామ ప్రజాప్రతినిధులైన సర్పంచ్‌లపైకి తోసేసేందుకు అధికారులు, కాంగ్రెస్ నాయకులు కలిసి పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ నాటకానికి తెరతీశారని ఆరోపించారు. గ్రామాల్లో రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసే సర్పంచ్‌ల ప్రతిష్టను దిగజార్చి, ప్రజల ముందు వారిని దోషులుగా నిలబెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కళాక్షి ఫెస్టివల్‌లో ఆకట్టుకున్న ఐశ్వర్య కళాకృతులు


చిన్ననాటి ఆసక్తితోనే చిత్రకళలో రాణిస్తున్నానన్న యువ కళాకారిణి



హనుమకొండ, అక్టోబర్ 24
హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన కళాక్షి ఫెస్టివల్ ఎడిషన్--2లో యువ కళాకారిణి నామాని ఐశ్వర్య ప్రదర్శించిన కళాకృతులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఐశ్వర్య వివిధ రకాల చిత్రాలను ప్రదర్శించగా, పలువురు సందర్శకులు వాటిని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఐశ్వర్య మాట్లాడుతూ చిన్ననాటి నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి ఉందని, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కళారంగంలో ముందుకు సాగుతున్నానని తెలిపారు. కళాకారులకు మంచి వేదిక కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, కళాక్షి ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐశ్వర్య తల్లిదండ్రులు సాంబయ్య, రమాదేవి పాల్గొన్నారు.

ఫేక్ సర్టిఫికెట్లతో కొలువులు - ఆ 800 మంది 'నకిలీ అధ్యాపకుల' గుర్తింపు వేగవంతం

హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్లుగా క్రమబద్ధీకరణ సమయంలో నకిలీ పోస్ట్ గ్రాడ్యుయేషన్? (పీజీ) సర్టిఫికెట్లను ఉపయోగించి రెగ్యులర్ ఉద్యోగాలు పొందిన వ్యక్తులను గుర్తించే ప్రక్రియను ఇంటర్? బోర్డు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే 35 మందిని తొలగించిన బోర్డు, మిగిలిన సిబ్బంది సర్టిఫికెట్ల ధ్రువీకరణను వేగవంతం చేసింది. ఈ ప్రక్రియ అనంతరం అధ్యాపకుల మార్కుల శాతాలను కూడా పరిశీలించే యోచనలో ఉంది.ధ్రువీకరణ డిసెంబర్ నాటికి పూర్తిరాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2000 నుంచి 2014 మధ్య కాలంలో పలు విడతలుగా కాంట్రాక్ట్ అధ్యాపకులుగా చేరారు. అయితే 2013 మేలో అప్పటి ప్రభుత్వం వారి పోస్టులను క్రమబద్ధీకరించింది. దీంతో 3,800 మంది శాశ్వత జూనియర్ లెక్చరర్లుగా మారారు. వీరిలో చాలా మంది బిహార్, ఉత్తర్? ప్రదేశ్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లోని పలు



విశ్వవిద్యాలయాల నుంచి పీజీ సర్టిఫికెట్లను సమర్పించారని, సరైన ధ్రువీకరణ లేకుండానే అధికారులు వాటిని ఆమోదించి నియామక ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపణలున్నాయి.ఈ నేపథ్యంలో అప్పటి నుంచి ఇప్పటికీ ఈ సర్టిఫికెట్ల సమీక్ష కొనసాగుతోంది. ప్రొబేషనరీ సమయం? సమీపించడంతో దీని ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ సర్టిఫికెట్లను ధ్రువీకరించడానికి ఇతర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలకు అధికారులను పంపుతున్నారు. వారి సర్టిఫికెట్లపై ధ్రువీకరణ పొందుతున్నారు. సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో ఇటీవల 35 మందిని తొలగించారు.వారిని ఇంకా పరిశీలించాల్సి ఉందిమన రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల సర్టిఫికెట్లు ఉంటే విశ్వవిద్యాలయా నికి సంబంధించిన అధికారులతో సంప్రదించడమే కాకుండా, పోలీసుల నుంచి కూడా నివేదికలను తీసుకుంటున్నారు. అయితే ప్రస్తుతానికి సుమారుగా 700 నుంచి 800 మంది వ్యక్తుల ధ్రువపత్రాలు ఇంకా పరిశీలించాల్సి ఉంది. దీనిలో ఇతర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలకు చెందిన సుమారు 400 మంది వరకు ఉంటారని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ మొత్తం ప్రక్రియను డిసెంబరు నాటికి పూర్తవుతుందని అధికారు అంటున్నారు.ఆ లేఖలు కూడా నకిలీవేకాంట్రాక్ట్ అధ్యాపకులు రెగ్యులర్? అయిన తర్వాత వారికి సంబంధించిన సర్టిఫికెట్లు అసలువేనని ధ్రువీ కరిస్తూ వారి సంబంధిత విశ్వవిద్యాలయాల నుంచి లిఖిత పూర్వకంగా లేఖ తెచ్చుకోవాలని బోర్డు ఆదేశించింది. దీనికి అధ్యాపకులంతా ఈ తరహా లేఖలను సమర్పించారు. వీరిలో పదుల సంఖ్యలో వ్యక్తులు విశ్వవిద్యాలయ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు తెలుస్తోంది.వారిలో ఒకరు సమర్పించిన లేఖలోని కోర్సు, ఆయన ఆ రాష్ట్ర వర్సిటీలో చదివిన సంవత్సరంలో లేదని సమాచారం. వీరితో పాటు అనేక మంది ఉమ్మడి రాష్ట్రంలోని వర్సిటీల నుంచి పీజీ పూర్తి చేసిన వారు సైతం ఉత్తీర్ణత శాతాన్ని పెంచి చూపినట్లు ఆరోపణ లొస్తున్నాయి.నకిలీ సర్టిఫికెట్లపై దర్యాప్తు ముగిసిన తర్వాత మార్కుల శాతంపై దృష్టి సారిస్తామని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. ర్పించి ఉద్యోగంలో చేరిన వారు స్వచ్ఛందంగా వైదొలిగితే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేయాలని ఉన్నతాధికారులు కోరుతున్నట్లు తెలిసింది.

సన్నవడ్లకు పెరిగిన డిమాండ్

కరీంనగర్:



ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేక వరినాట్లు తక్కువగా వేశారు. యాసంగిలో కూడా వరి వేయవద్దని ప్రభుత్వం చెబుతుండడంతో సన్నరకం ధాన్యానికి డిమాండ్ పెరిగింది. మరోవైపు బియ్యం ధరలు పెరుగుతుండడంతో మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులు ముం దుగానే ధాన్యాన్ని సమకూ ర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సన్నవడ్లను నేరుగా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతు న్నారు.వ్యాపారులు ధాన్యాన్ని కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్లోని నరసరావుపేట, గుంటూరు, మండపేట, గుడివాడతో పాటు తెలంగాణలోని మిర్యాలగూడ, హుజూర్నగర్, కోదాడ, ఖమ్మం జిల్లాలకు తరలిస్తున్నారు.ఇటీవల మార్కెట్లో సన్న బియ్యానికి గిరాకీ పెరగడంతో వ్యాపారులు ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గతంలో రైతులు తమ ధాన్యాన్ని వ్యవసాయ మార్కెట్ లేదా కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి విక్రయించేవారు. ప్రస్తుతం కొందరు వ్యాపారులు, మిల్లర్లు రైతుల వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అడ్వాన్స్గా డబ్బులు తీసుకోవాలని కోరుతున్నారు. దీంతో రైతులకు కూడా శ్రమ, ధాన్యం తరలింపు ఖర్చులు తప్పుతున్నాయి.

హైదరాబాద్లో రోడ్డు ప్రమాదం.. చిన్నారులకు తీవ్ర గాయాలు



హైదరాబాద్, :

హైదరాబాద్ వనస్థలిపురంలోని ఆటోనగర్లో రోడ్డు ప్రమాదం జరిగింది. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్ హైకోర్టు కాలనీ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. హయత్నగర్ రంగనాయకుల గుట్టకు చెందిన వంశీ, వాణి దంపతులు ఇద్దరు పిల్లలతో బైకుపై ఎల్బీనగర్ వైపు ప్రయాణిస్తుండగా ఓ కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి ఇద్దరు చిన్నారులు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు.ఈ ఘటనలో చిన్నారులు మాన్విశ్ (2), యుగ్విశ్ (ఏడాదిన్నర)కు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారుల తలకు గాయాలు, చెవుల నుంచి రక్తస్రావం అయినట్లు తెలుస్తోంది. బీటెక్ విద్యార్థి నితిన్ కారు నడుపుతున్నట్లు సమాచారం. కారులో నితిన్తో పాటు మరో ఇద్దరు స్నేహితులు ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందగానే ఘటనాస్థలికి వనస్థలిపురం పోలీసులు చేరుకున్నారు. ఈ ప్రమాదంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ను పోలీసులు క్లియర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై అధికారిక వివరాలు తెలియాల్సి ఉంది.

ఓటు తొలగించారని ఒక్కరూ ఫిర్యాదు చేయలేదు.. ఆధారాలు ఉంటే చూపండి

హైదరాబాద్ :

ఓట్ల తొలగింపు పేదలకు వ్యతిరేకంగా బీజేపీ పన్నిన కుట్ర అని సీఎం ఆరోపణ

ఆరోపణలకు ఆధారాలు చూపాలని రేవంత్ రెడ్డికి బీజేపీ సవాల్ 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' పేరుతో పాదయాత్రలకు సిద్ధమైన బీజేపీ నవంబర్ 1 నుంచి హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్లో బీజేపీ యాత్రలు


తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. తమ ఓటును తొలగించారని రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయలేదని, కానీ కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లను తొలగించి ఎన్నికల్లో గెలవాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు రకాల పౌరులను సృష్టిస్తున్నారని, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలోనూ బీజేపీ ఇదే పద్ధతిని అనుసరించిందని ఆయన విమర్శించారు.ఈ ఆరోపణలపై శుక్రవారం రాంచందర్ రావు స్పందిస్తూ, "ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా తన ఓటు పోయిందని చెప్పలేదు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాత్రమే వీధుల్లోకి వచ్చి ఓట్లు తొలగించారని అరుస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు తమ ఆరోపణలకు ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు.ఓట్ల తొలగింపు అంశంపై నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ ఆ తర్వాత సిద్దిపేట, కరీంనగర్లో కొనసాగుతుందని ఆయన తెలిపారు.ముఖ్యమంత్రి,పార్టీ తలపెట్టిన నిరసనలో ఆ పార్టీ నేతలు రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓటర్ల జాబితా సవరణ అంశం తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. భారీ ఎత్తున ఓట్లు తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, ఇది కేవలం నకిలీ, డూప్లికేట్, మరణించిన ఓటర్లను గుర్తించి తొలగించేందుకు ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియేనని బీజేపీ వాదిస్తోంది.




ఏపీ మున్సిపల్ ఎన్నికల బరిలో 'మజ్లిస్' - ప్రచారానికి హైదరాబాద్ నుంచి ఎమ్మెల్యేలు

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్లో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు మజ్లిస్ (ఏఐఎమ్ఐఎమ్) పార్టీ ముమ్మరంగా ప్రచారం చేస్తోంది. కడప కార్పొరేషన్ మేయర్ పదవికి, హిందూపురం మున్సిపాలిటీ ఛైర్పర్సన్ స్థానానికి ఆ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. విజయవాడ, కడప కార్పొరేషన్లతో పాటు మరో 5 మున్సిపాలిటీల్లో మొత్తం 21 మంది మజ్లిస్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.పార్టీ అధ్యక్షుడి సూచనల మేరకుఇటీవల ఆంధ్రప్రదేశ్కు చెందిన పలువురు మజ్లిస్ నాయకులు హైదరాబాద్కు వచ్చి పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని కలిశారు. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను బరిలో దించితే కచ్చితంగా విజయం సాధిస్తామని ఆయనతో ధీమా వ్యక్తం చేశారు. అన్ని మున్సిపాలిటీ స్థానాల్లో కాకుండా కచ్చితంగా విజయం సాధిస్తామని నమ్మకం ఉన్న వార్డులు, డివిజన్లలో మాత్రమే పోటీ చేయాలని ఒవైసీ సూచించగా, అందుకు వారు అంగీకరించారు. దీంతో కడప కార్పొరేషన్ మేయర్ పదవికి, విజయవాడ కార్పొరేషన్లోని మూడు డివిజన్లకు అభ్యర్థులను ఖరారు చేశారు.ప్రచారం ప్రారంభించిన మజ్లిస్ నేతలుహిందూపురం పురపాలక ఛైర్పర్సన్ స్థానంతో పాటు మరో 5 వార్డుల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థులు బరిలో నిలుస్తున్నారు. అలాగే ఆదోని-7, రాయదుర్గం-3, పెనుగొండ, నంద్యాల మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డు చొప్పున పోటీ



చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించేందుకు హైదరాబాద్ నుంచి ఎంఐఎం ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మిరాజ్, మాజిద్ హుస్సేన్, మహ్మద్ ముబీన్తో పాటు ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీలు ఇప్పటికే ఏపీకి వెళ్లి, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.నవంబర్ 1న ఎన్నికలుఆంధ్రప్రదేశ్లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల ప్రక్రియ కోసం ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ను ప్రకటించింది. ఈ షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1న 87 మున్సిపల్ కార్పొరేషన్లు, 13 మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు పోలింగ్ జరగనుంది. అవసరమైన చోట్ల నవంబర్ 2న రీ-పోలింగ్ నిర్వహించాలని సూచించింది. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టాలని ప్రకటించింది. వాస్తవానికి అక్టోబర్ 28న పోలింగ్ జరగాల్సి ఉండగా, సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్పులు చేసింది.సుప్రీంకోర్టు ఆదేశాలతో కొత్త షెడ్యూల్స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తొలి విడతగా నోటిఫికేషన్ జారీ చేసి, ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించాలని ఏపీఎస్?ఈసీ నిర్ణయించింది. ఉపసంహరణలకు ఈ నెల 21 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువునిచ్చింది. అయితే తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారంటూ వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు తుది జాబితాను వాయిదా వేసి నామినేషన్ వేయలేకపోయిన వారికి అవకాశం కల్పించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఎన్నికల ప్రక్రియను ఏపీఎస్?ఈసీ తాత్కాలికంగా వాయిదా వేసింది. అన్ని జిల్లాల నుంచి నివేదికలు తెప్పించుకొని కొత్త షెడ్యూల్ను ప్రకటించింది.

ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు లంచం డిమాండ్.. దళిత సర్పంచ్ మానస ఆవేదన



వేలేరు : హనుమకొండ జిల్లాలోని వేలేరు మండలం గుండ్లసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల వ్యవహారం వివాదానికి దారి తీసింది. ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరుగుతున్నాయని, అర్హులకు ఇల్లు కేటాయించకుండా ఇతరులకు కేటాయిస్తున్నారని గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు.జీపీ కార్యదర్శి రూ.50 వేలు లంచం తీసుకుని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మరోవైపు తాను బీఆర్ఎస్ పార్టీకి చెందిన దళిత సర్పంచ్ కావడంతో కొంత మంది రాజకీయ నాయకులు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామ సర్పంచ్ మానస ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల విషయంలో నెలకొన్న వివాదం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూడాలని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత పాటించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లంచం ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలీసు వ్యవస్థ పనితీరు అవగాహన కోసం 'ఓపెన్ హౌస్'?

అనంతగిరి, అక్టోబర్ 24 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా అనంతగిరి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల విధులు, బాధ్యతలు, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ



అందిస్తున్న సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ శాఖలో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, భద్రతా పరికరాలు, కమ్యూనికేషన్ పరికరాలు, నేర పరిశోధనకు ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పోలీసింగ్ విధానాల గురించి స్టేషన్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు.ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు వారి ధైర్యసాహసాలను విద్యార్థులకు వివరించి. సమాజంలో శాంతి, భద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర ఎంత ముఖ్యమైనదో వారికి తెలియజేశారు. విద్యార్థులు చట్టాలను గౌరవించాలని, క్రమశిక్షణతో మెలగాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలు మరియు ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎల్ నినో, కరవుపై బీఆర్ఎస్ విమర్శలకు కాంగ్రెస్ నేతల కౌంటర్

హైదరాబాద్ : హైదరాబాద్: ఎల్ నినో ప్రభావం, కరవు పరిస్థితులపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ నేతలు ఘాటుగా స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని పరిస్థితులను వివరిస్తూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ వేముల వీరేశం విమర్శలు గుప్పించారు. కరోనా సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని మంత్రి అడ్లూరి ఆరోపించగా.. ఫామ్హౌస్లో కూర్చొని ప్రభుత్వంపై విమర్శలు చేయడం కేసీఆర్కు అలవాటుగా మారిందని వేముల వీరేశం మండిపడ్డారు. హైదరాబాద్లోని సీఎల్పీ మీడియా హాల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతలు ఎల్ నినోపై బీఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టారు. కరోనా మహమ్మారి సమయంలో తన సొంత చెల్లిని కోల్పోయానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్



ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి ఉంటే తన చెల్లి ప్రాణాలతో ఉండేదని వ్యాఖ్యానించారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వ అసమర్థత కారణంగానే కరోనా మందులు బ్లాక్ మార్కెట్లోకి వెళ్లాయని ఆరోపించారు. ఆ సమయంలో కనీసం మాస్కులు కూడా అందించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. మహమ్మారి సమయంలో కేసీఆర్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఆరోపించారు. కరోనా మరణాలకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యత వహిస్తారా? అని అడ్లూరి ప్రశ్నించారు.కరోనా సంక్షోభ సమయంలో కాంగ్రెస్ పార్టీ హుందాగా వ్యవహరించిందని ఆయన పేర్కొన్నారు. కరవుకు కాంగ్రెస్ కారణమైతే, కరోనా సంక్షోభానికి బీఆర్ఎస్ కారణమా? అని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ నేతల విమర్శలకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. ఎల్ నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపించే ప్రకృతి సంబంధిత పరిణామమని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను రాజకీయాలతో ముడిపెట్టి విమర్శలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి ప్రణాళికలు రూపొందిస్తున్నారని, విపత్తుల సమయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మంత్రి అడ్లూరి ధీమా వ్యక్తం చేశారు.ఫామ్హౌస్లో కూర్చొని విషం చిమ్ముతున్నారు: వేముల వీరేశంబీఆర్ఎస్ అధినేత కేసీఆర్పై ప్రభుత్వ విప్ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫామ్హౌస్లో కూర్చొని ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. కరవుకు కాంగ్రెస్ కారణమని చెప్పే కేసీఆర్ను సైంటిస్టుగా అభివర్ణిస్తూ ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వ్యక్తి కేసీఆర్ అని ఆరోపించారు. కరోనా సంక్షోభానికి కేసీఆర్ కారణమని తాము చెప్పడం లేదని, అయితే కరవు పరిస్థితులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు సరికావని వీరేశం వ్యాఖ్యానించారు.చిల్లర మాటలు, చిల్లర వాగ్దానాలుగా అభివర్ణిస్తూ వీరేశం మండిపడ్డారు.

జనరల్ న్యూస్

వరుసగా ఫెయిల్.. అయినా ఛాన్స్‌లిస్తోన్న గంభీర్..



న్యూజిలాండ్ జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ (విజయంతో ప్రారంభించింది. క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన తొలి టీ20లో 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఈ మ్యాచ్‌లో భారత మిడిల్ ఆర్డర్ ఒక దశలో తడబడటంతో రెండో టీ20కి ముందు జట్టు కూర్పుపై చర్చ మొదలైంది.తొలి మ్యాచ్‌లో భారత ఓపెనర్లు సంజూ శాంసన్ (ఘాఅయబ ఘాఎంశీఅ), అభిషేక్ శర్మ (ఘాఎష్ట్రఅంష్ట్రవని ఘాష్ట్రుతీఎఘ) దూకుడుగా ఆడారు. కేవలం 6.5 ఓవర్లలోనే జట్టు స్కోరు 100 పరుగులకు చేరువైంది. అయితే ఆ తర్వాత వికెట్లు వరుసగా పడటంతో భారత్‌పై ఒత్తిడి పెరిగింది. చివరికి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (ఘాష్ట్రతీవఘుం ×ఎవతీ) కీలక ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు.

తిలక్ వర్మపై మరోసారి చర్చ

ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ గాయం కారణంగా తిలక్ వర్మ (ఏఅశ్రీఘన ఘుతీఎఘ)కు మూడో స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చింది. అయితే అతడు 11 బంతుల్లో కేవలం 6 పరుగులు మాత్రమే చేశాడు.ఇటీవల తిలక్ ప్రదర్శనను పరిశీలిస్తే పరుగుల సంఖ్య పూర్తిగా నిరాశపరిచేలా లేకపోయినా.. కీలక దశల్లో అతడు వికెట్ కోల్పోవడం చర్చనీయాంశంగా మారింది. ఇచ్చిన గణాంకాల ప్రకారం గత ఐదు టీ20 మ్యాచ్‌ల్లో తిలక్ మొత్తం 128 పరుగులు చేశాడు.తొలి టీ20లో అతడి వైఫల్యం నేపథ్యంలో రెండో మ్యాచ్‌లో తుది జట్టులో మార్పు ఉంటుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. ముఖ్యంగా శివమ్ దూబే (ఘాష్ట్రఅఱుఎ ణబఎవ) బెంచ్‌పై ఉన్న నేపథ్యంలో ఈ చర్చ మరింత ఆసక్తికరంగా మారింది.దూబేకు అవకాశం దక్కుతుందా?

శివమ్ దూబే బ్యాట్‌తో భారీ షాట్లు ఆడటంతో పాటు అవసరమైన సమయంలో మీడియం పేస్ బౌలింగ్ చేయగల ఆల్‌రౌండర్. క్రైస్ట్‌చర్చ్‌లోని హెగ్లీ ఓవల్ మైదానం భారీ స్కోర్లకు అనుకూలంగా ఉండే పరిస్థితుల్లో దూబే పవర్ హిట్టింగ్ భారత్‌కు ఉపయోగపడే అంశంగా కనిపిస్తోంది.అయితే తిలక్ వర్మను కొనసాగించాలా, దూబేను తుది జట్టులోకి తీసుకురావాలా అనేది టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఒక్క మ్యాచ్ ప్రదర్శన ఆధారంగా ఆటగాడిపై తుది నిర్ణయం తీసుకోవడం కూడా సరైనది కాకపోవచ్చు.రెండో టీ20 ఎప్పుడు?

భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టీ20 అక్టోబర్ 24న క్రైస్ట్‌చర్చ్‌లోని హెగ్లీ ఓవల్‌లో జరగనుంది. తొలి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంతో సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించేందుకు ఈ మ్యాచ్ కీలకంగా మారింది. మరోవైపు తొలి మ్యాచ్‌లో 225కుపైగా స్కోరు చేసినప్పటికీ ఓటమి ఎదుర్కొన్న న్యూజిలాండ్.. రెండో మ్యాచ్‌లో పుంజుకోవాలని చూస్తోంది. భారత్ మాత్రం మిడిల్ ఆర్డర్‌లోని సమస్యలను

సింగిల్ ఛార్జ్‌పై 440 కి.మీ. మైలేజ్.. అదిరిపోయే ఎలక్ట్రిక్ కారు విడుదల!



స్కోడా భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ కార్ల కంపెనీలలో ఒకటి. వారి కార్లు చాలా ప్రజాదరణ పొందాయి. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్లకు భారీ డిమాండ్ ఉంది. దీనిని అనుసరించి, ప్రముఖ కార్ల కంపెనీలు పూర్తిగా ఎలక్ట్రిక్ కార్ల తయారీ రంగంలోకి ప్రవేశించాయిస్కోడా కొత్త ఎలక్ట్రిక్ కారు:

ఈ పరిస్థితుల్లో స్కోడా తన కొత్త ఎలక్ట్రిక్ కారు అయిన ఎపిక్ స్పోర్ట్‌లైన్‌ను యూరోపియన్ మార్కెట్‌లో విడుదల చేసింది. ఇది ఒక కాంపాక్ట్ ఖాఒ. దీని టాప్ వేరియంట్ అయిన 55 జుణజ, 208 హార్స్‌పవర్‌తో విడుదల చేసింది. ఈ కారును టూ-వీల్ డ్రైవ్ కారుగా విడుదల చేశారు.బ్యాటరీ వేరియంట్:

దీని ప్రారంభ వేరియంట్‌ను 38.5 ఎఔష్ట్ర బ్యాటరీతో పరిచయం చేశారు. దీని టాప్ వేరియంట్‌ను 55 ఎఔష్ట్ర బ్యాటరీ వేరియంట్‌గా పరిచయం చేశారు. మొదటి వేరియంట్‌లో ళాళీం బ్యాటరీని అమర్చారు. రెండవ వేరియంట్‌లో చీవీజ బ్యాటరీని అమర్చారు. మొదటి వేరియంట్‌ను 133 హెచ్‌పి హార్స్‌పవర్‌తో పరిచయం చేశారు. రెండవ వేరియంట్‌ను 208 హెచ్‌పి హార్స్‌పవర్‌తో పరిచయం చేశారు. మొదటి వేరియంట్‌లో 267 ఎన్ఎమ్ టార్క్ ఉండగా, రెండవ వేరియంట్‌లో 290 ఎన్ఎమ్ టార్క్ ఉంది.440 కి.మీ. మైలేజ్:38.5 ఎఔష్ట్ర బ్యాటరీతో కూడిన వేరియంట్ ఒకే ఛార్జ్‌పై 310 కిలోమీటర్ల వరకు మైలేజీని అందిస్తుంది. టాప్ వేరియంట్ ఒకే ఛార్జ్‌పై 440 కిలోమీటర్ల వరకు మైలేజీని అందిస్తుంది. టాప్ఒకే ఛార్జ్‌పై 440 కిలోమీటర్ల వరకు మైలేజీని వేరియంట్ 7.1 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. ణజ ఛార్జింగ్‌లో, మొదటి వేరియంట్ 23 నిమిషాల్లో, టాప్ వేరియంట్ 24 నిమిషాల్లో 80 శాతానికి ఛార్జ్ అవుతుంది.సౌకర్యాలు:ఈ రెండు వేరియంట్లను ఆటోమేటిక్ వేరియంట్లుగా పరిచయం చేశారు. ఈ రెండు వేరియంట్లు గరిష్టంగా గంటకు 160 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలవు. ఈ కారు 4,171 మిమీ పొడవు, 1,798 మిమీ వెడల్పు, 1,581 మిమీ ఎత్తు కలిగి ఉంది. ఈ కారును 5-సీటర్ కారుగా పరిచయం చేశారు. దీనికి 475-లీటర్ల ట్రంక్ ఉంది. ఈ కారుకు 19-అంగుళాల అల్లాయ్ వీల్స్ అమర్చారు. దీనికి ఎల్ఈడీ లైట్లు అమర్చారు. ఈ కారులో 360-డిగ్రీ కెమెరా సిస్టమ్, 10-స్పీకర్ల కాంటన్ ఆడియో సిస్టమ్, రిమోట్ పార్కింగ్, రివర్స్ అసిస్ట్ ఉన్నాయి. ఈ కారును భారత మార్కెట్లో ఎప్పుడు విడుదల చేస్తారనే దానిపై ఇంకా సమాచారం లేదు.

ఆ నలుగురు సీనియర్ ఆటగాళ్లకు బీసీసీఐ షాక్..



న్యూజిలాండ్ పర్యటన కోసం బీసీసీఐ వన్డే, టెస్టు జట్లను ప్రకటించింది. టీ20 జట్టును అంతకుముందే వెల్లడించింది. ఈ ఎంపికల్లో కొందరు సీనియర్ ఆటగాళ్లకు వన్డే జట్టులో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా మహమ్మద్ షమీ, రవీంద్ర జడేజా, యుజ్వేంద్ర చాహల్, భువనేశ్వర్ కుమార్ విషయంలో అభిమానులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. వచ్చే ఏడాది జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్‌కు భారత జట్టును సిద్ధం చేసే క్రమంలో ఈ ఎంపికలు కీలకంగా మారవచ్చు. అయితే జట్టులో చోటు దక్కలేదని ఆటగాళ్ల కెరీర్ ముగిసిపోయిందని ఇప్పుడే చెప్పలేం. వారి ఫిట్‌నెస్, ప్రదర్శన, భవిష్యత్తులో జరిగే ఎంపికలపై అవకాశాలు ఆధారపడి ఉంటాయి.భారత జట్టు తరఫున కీలక మ్యాచ్‌ల్లో అద్భుతంగా బౌలింగ్ చేసిన మహమ్మద్ షమీకి న్యూజిలాండ్ పర్యటన కోసం ప్రకటించిన వన్డే, టెస్టు జట్లలో చోటు దక్కలేదు. 2023 వన్డే ప్రపంచకప్‌లో షమీ అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిం చాడు. ఆ టోర్నీలో కేవలం ఏడు మ్యాచ్‌ల్లోనే 24 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. తాజా ఎంపికలకు ముందు రంజీ ట్రోఫీ తొలి రౌండ్‌లో ఐదు వికెట్లు తీసినట్లు వచ్చిన నివేదికలు కూడా అతడి ఫామ్‌పై చర్చకు కారణమయ్యాయి. అయినప్పటికీ న్యూజిలాండ్ పర్యటనకు అతడిని ఎంపిక చేయలేదు. వయసు, ఫిట్‌నెస్, బౌలింగ్ సామర్థ్యం, భవిష్యత్తు ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు నిర్ణయం తీసుకుని ఉండవచ్చు. అయితే షమీ 2027 ప్రపంచకప్ ప్రణాళికల్లో లేడని బీసీసీఐ అధికారికంగా ప్రకటించలేదు.టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో అవకాశం దక్కలేదు. దీంతో అతడి వన్డే భవిష్యత్తుపై చర్చ మొదలైంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. మూడు విభాగాల్లోనూ జట్టుకు ఉపయోగపడే ఆటగాడిగా జడేజాకు గుర్తింపు ఉంది. అయినా తాజా వన్డే ఎంపికల్లో అక్షర్ పటేల్, నమన ధీర్ వంటి ఆటగాళ్లకు అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ఇషాన్ కిషన్ (xంష్ట్రుఅ ఖఅంష్ట్రుఅ) గాయం కారణంగా రెండో మ్యాచ్‌కు దూరం కావడం భారత జట్టు కూర్పుపై ప్రభావం చూపనుంది. ఇషాన్ కిషన్ సాధారణంగా మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. తొలి టీ20లో గాయపడిన అతడు రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉండడని బీసీసీఐ వెల్లడించింది. దీంతో సరాంసన్ ఓపెనింగ్ స్థానాన్ని వదిలి చోటు కల్పించారు. అయితే జడేజాను పూర్తిగా పక్కన పెట్టారని భావించడం సరికాదు. బీసీసీఐ ప్రకటించిన టెస్టు జట్టులో అతడికి స్థానం లభించింది. అంటే ప్రస్తుతం వన్డే ప్రణాళికల్లో అతడికి అవకాశం ఇవ్వకపోయినా, టెస్టు ఫార్మాట్‌లో మాత్రం జట్టు ప్రణాళికల్లో కొనసాగుతున్నాడు. 2027 ప్రపంచకప్‌కు ముందు జరిగే మ్యాచ్‌ల్లో ఆటగాళ్ల ప్రదర్శనను బట్టి పరిస్థితులు మారే అవకాశం ఉంది.

భారత స్పిన్ బౌలర్ యుజ్వేంద్ర చాహల్ కూడా న్యూజిలాండ్ పర్యటన కోసం ప్రకటించిన జట్లలో చోటు దక్కించుకోలేదు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో చాహల్ తన లెగ్ స్పిన్‌తో ఎన్నోసార్లు ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. మధ్య ఓవర్లలో వికెట్లు తీసే సామర్థ్యం అతడి ప్రత్యేకత. అయితే ఇప్పుడు జట్టులో స్పిన్ బౌలింగ్‌కు పోటీ పెరిగింది. కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, ఇతర స్పిన్నర్లు సెలెక్టర్ల పరిశీలనలో ఉన్నారు. చాహల్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌కు వీడ్కోలు పలికినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో అతడి అంతర్జాతీయ భవిష్యత్తుపై మరింత చర్చ జరుగుతోంది. అయినా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌కు దూరమవడం అంటే వన్డేలు, టీ20లకు కూడా వీడ్కోలు పలికినట్లుకాదు. చాహల్ మళ్లీ జట్టులోకి రావాలంటే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తన ఫామ్‌ను నిరూపించుకోవాల్సి ఉంటుంది.టీ20ల్లో అవకాశం రావడం సానుకూల పరిణామమే అయినా, వన్డేల్లో చోటు దక్కాలంటే ఆ ఫార్మాట్‌కు అవసరమైన ప్రదర్శనతో సెలెక్టర్లను ఆకట్టుకోవాలి.

ఇంటర్నెట్ మార్కెట్‌లో గుత్తాధిపత్యం.. శాటిలైట్ సేవలతో ధరలు దిగొస్తాయా?



హైదరాబాద్ శివారులోని ఓ చిన్న పట్టణంలో ఆఫీస్ బ్రాడ్‌బ్యాండ్ తరచూ మొరాయిస్తుండటంతో, డెడ్‌లైన్ ఒత్తిడిలో మొబైల్ హాట్‌స్పాట్, పొరుగింటి వైఫైపై ఆధారపడాల్సిన పరిస్థితి ఒక వినియోగదారుడికి ఎదురైంది. ప్రతినెలా బిల్లు కట్టి ఫిర్యాదు చేయడం, సమస్య పరిష్కారం కోసం ఎదురుచూడటం అక్కడి వినియోగదారులకు పరిపాటిగా మారింది. దేశవ్యాప్తంగా బ్రాడ్‌బ్యాండ్ విస్తరణ రికార్డు స్థాయిలో సాగుతున్న వేళ, క్షేత్రస్థాయిలో నాణ్యత మాత్రం ఇలాంటి సమస్యల నడుమ కొట్టుమిట్టాడుతోంది.ఆగస్టు 2026 అధికారిక నివేదిక ప్రకారం, దేశంలో మొత్తం బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ల సంఖ్య 1.1 బిలియన్లకు (1,101.21 మిలియన్లు) చేరింది. అయితే ఈ మార్కెట్లో దాదాపు 84 శాతం వాటా రెండు ప్రధాన సంస్థల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. జియో 538.03 మిలియన్ల (48.86%) కనెక్షన్లతో మొదటి స్థానంలో నిలవగా, ఎయిర్‌టెల్ 386.39 మిలియన్ల (35.09%) కనెక్షన్లతో రెండో స్థానంలో ఉంది. మిగిలిన వాటాలో వీఐ 130.88 మిలియన్లు, బీఎస్ఎన్ఎల్ 27.82 మిలియన్లు, ఏసీటీ 2.48 మిలియన్ల కనెక్షన్లను కలిగి ఉన్నాయి.ఈ ఆధిపత్యం నడుమ శాటిలైట్ ఇంటర్నెట్ ప్రవేశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. స్టార్‌లింక్ జూన్ 2025లోనే జీఎంపీసీఎస్ లైసెన్స్, జూలై 2025లో ఇన్-స్పేస్ అనుమతులు సాధించినప్పటికీ, వాణిజ్య సేవలు ప్రారంభించడానికి అవసరమైన భద్రతా అనుమతులు, స్పెక్ట్రమ్ కేటాయింపుల దశలోనే నిలిచిపోయింది. వన్‌వెబ్, జియో శాటిలైట్ విభాగాలు సైతం ఇదే అనుమతుల ప్రక్రియను ఎదుర్కొంటున్నాయి. నిబంధనల అమలు నిష్పాక్షికంగా ఉందని ప్రభుత్వం చెబుతుండగా, మార్కెట్ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికే అడ్డంకులు సృష్టిస్తున్నారని ఎలాన్ మస్క్ ఆరోపిస్తున్నారు. శాటిలైట్ నెట్‌వర్క్‌ల భద్రత అంశాలు క్షేత్రస్థాయిలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.అండమాన్ నికోబార్ దీవుల్లో డ్రగ్స్ వేటలో, మణిపూర్‌లో మిలిటెంట్ల వద్ద అనధికార స్టార్‌లింక్ టెర్మినల్స్ పట్టుబడ్డాయి. అంతర్జాతీయంగా అమెజాన్ అక్రమ గనుల తవ్వకాలు, మయన్మార్ స్కామ్ కేంద్రాలు, ఉక్రెయిన్‌లో రష్యా సైనిక బలగాల వద్ద కూడా ఈ పరికరాలు కనిపించాయి. సంస్థ నిబంధనలను ఉల్లంఘించిన వేలాది టెర్మినళ్లను నిలిపివేసినప్పటికీ, స్థానిక నిఘా వ్యవస్థల పర్యవేక్షణకు చిక్కకుండా పనిచేసే స్వభావం వీటికి ఉండటంతో నియంత్రణ పెద్ద సవాలుగా మారింది.దేశంలో ఫైబర్, 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ విస్తరించిన ప్రాంతాల్లో కొత్త శాటిలైట్ సంస్థల రాక వల్ల నెలవారీ ధరలు తగ్గే అవకాశం తక్కువగానే కనిపిస్తోంది. జియో, ఎయిర్‌టెల్ 300 ఎంబీపీఎస్ వేగంతో కూడిన ఫైబర్

వైభవ్ ఇన్.. తిలక్ ఔట్..



: భారత్) న్యూజిలాండ్ (చీవష్ట్ర ఘుశ్రీఘఅఽ) మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో రెండో మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. క్రైస్ట్‌చర్చ్ వేదికగా అక్టోబర్ 24న జరగనున్న ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధించి సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించాలని (శ్రేయస్ అయ్యర్ (ఘాష్ట్రతీవఘుం ×ఎవతీ) సారథ్యంలోని భారత జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.తొలి టీ20లో విజయం సాధించిన భారత్.. రెండో మ్యాచ్‌లోనూ గెలిస్తే సిరీస్ విజయానికి మరింత చేరువ అవుతుంది. ఈ నేపథ్యంలో తుది జట్టులో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉంది.అదే జరిగితే యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. వైభవ్ ఇప్పటివరకు భారత్ తరఫున ఆడిన ఎనిమిది టీ20 మ్యాచ్‌ల్లోనూ ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. దీంత)తో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశం అతడికి లభించవచ్చు.తిలక్ వర్మకు బదులుగా దూబే?మరోవైపు తిలక్ వర్మ స్థానంపైనా చర్చ జరుగుతోంది. తొలి టీ20లో ఇషాన్ గాయపడటంతో తిలక్‌కు మూడో స్థానంలో వన్‌డౌన్‌లో బ్యాటింగ్ చేసే అవకాశం అవసరమైన సమయంలో మీడియం పేస్ బౌలింగ్‌తోనూ అతడు జట్టుకు ఉపయోగపడగలడు.రెండో టీ20లో భారత్ తుది జట్టు ఎలా ఉండొచ్చు?అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్.

తొలి మ్యాచ్‌లో సాధించిన విజయాన్ని కొనసాగిస్తూ సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించడమే భారత్ ముందున్న ప్రధాన లక్ష్యం. బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చింది. అయితే అతడు 11 బంతుల్లో కేవలం 6 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు.


దీంతో రెండో టీ20లో తిలక్ స్థానంలో ఆల్‌రౌండర్ శివమ్ దూబే (ఘాష్ట్రఅఱుఎ ణబఎవ)ను తీసుకునే అవకాశం ఉందని సమాచారం. బ్యాటింగ్‌లో భారీ షాట్లు ఆడగల దూబేకు క్రైస్ట్‌చర్చ్ మైదానం కూడా అనుకూలంగా ఉండొచ్చని భావిస్తున్నారు.

బ్యాంక్ ఖాతాను వాడకుంటే..మీ డబ్బు ఏమవుతుంది?



ఏదైనా బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్ తెరిచారా? ఉద్యోగ రీత్యా కంపెనీ మారడం, మరో బ్యాంకులో ఖాతా ప్రారంభించడం లేదా ఇతర కారణాలతో పాత ఖాతాను ఉపయోగించడం మానేశారా? అయితే ఈ విషయం తప్పక తెలుసుకోవాలి. రెండేళ్లకు పైగా లావాదేవీలు జరగని సేవింగ్స్ లేదా కరెంట్ ఖాతాను బ్యాంకులు ఇన్‌ఆపరేటివ్ ఖాతాగా పరిగణిస్తాయి. అయితే, అలా మారినంత మాత్రాన ఖాతాలోని డబ్బు పోయినట్లు కాదు. ఖాతాను తిరిగి యాక్టివేట్ చేసుకోవడానికి, పదేళ్లుగా క్లెయిమ్ చేయని డిపాజిట్లను తిరిగి పొందడానికి కూడా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) నిబంధనలు ఉన్నాయి.ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం, సేవింగ్స్ లేదా కరెంట్ ఖాతాలో రెండేళ్లకు మించి కస్టమర్ లావాదేవీలు జరగకపోతే దాన్ని ఇన్‌ఆపరేటివ్ ఖాతాగా పరిగణిస్తారు. కస్టమర్ స్వయంగా చేసిన లావాదేవీలతో పాటు, ఆయన తరఫున మూడో వ్యక్తి చేసిన లావాదేవీలు కూడా ఇందులోకి వస్తాయి. అయితే, బ్యాంకు జమ చేసే వడ్డీ లేదా బ్యాంకు విధించే సర్వీస్ ఛార్జీలను సాధారణంగా కస్టమర్ జరిపిన లావాదేవీలుగా పరిగణించరు. కాబట్టి ఖాతాలో వడ్డీ జమ అవుతోందని మాత్రమే ఖాతా యాక్టివ్‌గా ఉంటుందని భావించకూడదు. ఖాతాను తిరిగి యాక్టివేట్ చేసుకోవడం ఎలా?మీ పాత బ్యాంకు ఖాతాను తిరిగి ఉపయోగించుకోవాలనుకుంటే సంబంధిత బ్యాంకును సంప్రదించాలి. అవసరమైన వివరాలను అప్‌డేట్ చేసి, ఖాతాను యాక్టివేట్ చేయాలని దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆర్‌బీఐ సూచనల ప్రకారం, ఇన్‌ఆపరేటివ్ ఖాతాల యాక్టివేషన్ కోసం ళీజ అప్‌డేట్ సదుపాయాన్ని బ్యాంకులు హోమ్ బ్రాంచ్‌తో పాటు ఇతర బ్రాంచ్‌లలోనూ అందుబాటులో ఉంచాలి. సదుపాయం ఉన్నచోట వీడియో కస్టమర్ ఐడెంటిఫికేషన్ ప్రాసెస్ (ఎ-జశ్రీ) ద్వారా కూడా ళీజ అప్‌డేట్ చేసుకునే అవకాశం ఉంటుంది.


అతనంటే నాకు పిచ్చి ఇష్టం



ఒకరు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులకు దగ్గరవుతున్నారు. తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తూ తనదైన ముద్ర వేస్తున్న ఈ అందాల భామ.. ఓ పాడ్‌కాస్ట్‌లో తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

ఐశ్వర్య రాజేశ్ మాట్లాడుతూ.. హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకోకముందు నుంచే సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అంటే తనకు చాలా ఇష్టమని వెల్లడించారు. అతడిపై ఉన్న అభిమానాన్ని తన స్నేహితులతో కూడా పంచుకునేవారని తెలిపారు. సుశాంత్‌ను ప్రత్యక్షంగా చూడాలని, అతడితో కలిసి ఓ ఫొటో దిగాలని అప్పట్లో ఎంతో ఆశపడినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటికీ సుశాంత్ అంటే తనకు ఎంతో ఇష్టమని, అతడిపై ఉన్న క్రష్ అలాగే ఉందని పేర్కొన్నారు.ఐశ్వర్య రాజేశ్ మాట్లాడుతూ.. హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకోకముందు నుంచే సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అంటే తనకు చాలా ఇష్టమని వెల్లడించారు. అతడిపై ఉన్న అభిమానాన్ని తన స్నేహితులతో కూడా పంచుకునేవారని తెలిపారు. సుశాంత్‌ను ప్రత్యక్షంగా చూడాలని, అతడితో కలిసి ఓ ఫొటో దిగాలని అప్పట్లో ఎంతో ఆశపడినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటికీ సుశాంత్ అంటే తనకు ఎంతో ఇష్టమని, అతడిపై ఉన్న క్రష్ అలాగే ఉందని పేర్కొన్నారు.ఓసారి గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లినప్పుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌ను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఐశ్వర్యకు లభించిందట. అతడిని చూసి ఎంతో సంతోషించిన ఆమె.. ఎలాగైనా ఓ ఫొటో తీసుకోవాలని అనుకున్నారట. ఫిల్మ్ ఫెస్టివల్ అనంతరం జరిగే నైట్ పార్టీకి సుశాంత్ వస్తారని భావించి ఎదురుచూశారు. అయితే ఆయన ఆ పార్టీకి రాకపోవడంతో నిరాశ చెందారట.ఓసారి గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లినప్పుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌ను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఐశ్వర్యకు లభించిందట. అతడిని చూసి ఎంతో

సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో ఐశ్వర్య రాజేశ్



ఫౌజీ అప్డేట్ వచ్చేసింది..

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ ఎవైటెడ్ పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'. తాజాగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ టైటిల్, గ్లింప్స్ , విడుదల తేదీని ప్రకటిస్తూ ఒక పవర్‌ఫుల్ వీడియోను విడుదల చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో రికార్డులను సృష్టిస్తూ ట్రెండింగ్‌లో నిలిచింది. 'ఫైల్ నం. 25: ఫౌజీ' (ఖీఅశ్రీవ అశీ. 25 : ఖీూఖ్ఖ×) పేరుతో విడుదలైన ఈ గ్లింప్స్ వీడియో సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. ఈ గ్లింప్స్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ , అడాల్ఫ్ హిట్లర్ మధ్య జరిగే సంభాషణతో కథ ప్రారంభమవుతుంది. బ్రిటీష్ వారిని ఓడించడానికి జర్మనీ సహాయం కోరడానికి వెళ్లిన సుభాష్ చంద్రబోస్ తో హిట్లర్ మాట్లాడే సీన్ అత్యంత ఆసక్తికరంగా ఉంది. ఇండియన్ల రక్తంలో బానిసత్వం ఉందని, యుద్ధంలో గెలవడం కష్టమని హిట్లర్ అనగా.. ఇంటెలిజెన్స్ గురించి, బ్రిటిష్వారిని గడగడలాడించిన ఒకే ఒక్క సైనికుడి గురించి బోస్ వివరిస్తారు.బ్రిటీష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆ సైనికుడిని 'ఫౌజీ' అని పిలుస్తారని, భగవద్గీత ఆధారంగా అతడు సృష్టించిన కోడ్ ఎనిగ్మా కంటే ప్రమాదకరమని బోస్ చెప్పే డైలాగ్స్ గూస్‌బంప్స్ తెప్పిస్తాయి. చివరిలో ప్రభాస్ మాస్ ఎంట్రీ ఇచ్చి, బ్రిటీష్ అధికారులను హెచ్చరిస్తూ చెప్పే మాస్ డైలాగ్స్ సినిమాపై అంచనాలను స్కై-హైకి తీసుకెళ్లాయి.కేవలం గ్లింప్స్‌తోనే సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేసిన చిత్రబృందం, ఈ మూవీ విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించింది. ఈ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ సినిమాను 2027 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం, విజువల్స్ హాలీవుడ్

ఓటీటీలోకి కయాదు లోహర్ కొత్త సినిమా



టాలీవుడ్ ,కోలీవుడ్‌లో మ్యూజిక్ డైరెక్టర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు, హీరోగానూ వరుస వైవిధ్యమైన చిత్రాలతో దూసుకుపోతున్నారు జీవీ ప్రకాశ్ కుమార్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా ఫాంటసీ హారర్ థ్రిల్లర్ మూవీ 'ఇమ్మోర్టల్'. 'నాకు మరణం లేదు' అనేది ఈ చిత్రానికి ఉపశీర్షిక. మారియప్పన్ చిన్న దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ సొంతం చేసుకుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ అప్‌డేట్ అధికారికంగా బయటికి వచ్చింది. థియేటర్లలో ప్రేక్షకులను భయపెడుతూనే మరోవైపు రొమాంటిక్ అండ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకున్న 'ఇమ్మోర్టల్' సినిమా త్వరలోనే ఓటీటీ ప్రియులను అలరించడానికి సిద్ధమైంది.ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం సోనీ లివ్ వేదికగా ఈ చిత్రం అక్టోబర్ 30 నుంచి డిజిటల్ స్ట్రీమింగ్‌కు రానుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ఏకకాలంలో ఈ మూవీ అందుబాటులోకి రానుండటంతో హారర్ జోనర్ ఇష్టపడే సినీ ప్రియులు ఓటీటీలో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో కయాదు లోహర్ కథానాయికగా నటించింది.మహి (జీవీ ప్రకాశ్) అనే సాధారణ యువకుడు తన ఉద్యోగ రీత్యా తక్కువ అద్దెలో ఇల్లు వెతుకుతూ ఉంటాడు. ఆ సమయంలో సింధు (కయాదు లోహర్) అనే యువతితో పరిచయం ఏర్పడుతుంది. ఆమె ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోనే షేరింగ్ ఫ్లాట్‌లో మహి అద్దెకు దిగుతాడు. తొలిచూపులోనే సింధుతో ప్రేమలో పడిన మహి జీవితంలో కొన్ని ఊహించని వింత సంఘటనలు చోటుచేసుకుంటాయి. అసలు సింధు ఎవరు? ఆమె వెనుక ఉన్న వెయ్యేళ్ల నాటి జానపద మిస్టరీ ఏంటి? ఆ అపార్ట్‌మెంట్‌లోని భయానక రహస్యాల నుంచి మహి ఎలా బయటపడ్డాడు? అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశం.

ఎట్టకేలకు కోలీవుడ్ కల నెరవేర్చనున్న రజనీకాంత్..



ఆల్‌టైమ్ రికార్డ్ వసూళ్ల దిశగా 'జైలర్ 2'

భారీ బడ్జెట్ సినిమాలు వెయ్యి కోట్ల మార్కును చేరుకోవడం ఇప్పుడు సర్వసాధారణమైపోయింది. పెద్ద స్టార్ నటుల కొన్ని యావరేజ్ సినిమాలు కూడా కేవలం నెల రోజుల్లోనే వెయ్యి కోట్ల వసూలు చేశాయి. అనేక బాలీవుడ్, తెలుగు సినిమాలు ఇప్పటికే వెయ్యి కోట్ల క్లబ్ లో చేరాయి. కేజీఎఫ్, కంతర వంటి కన్నడ చిత్రాలు కూడా వెయ్యి కోట్ల మార్కును దాటాయి. కానీ రజనీకాంత్ , కమల్ హాసన్, విజయ్, అజిత్, సూర్య వంటి స్టార్ నటులు ఉన్న తమిళ చిత్ర పరిశ్రమ మాత్రమే ఈ ఘనతను సాధించలేకపోయింది. బాక్సాఫీస్ వద్ద రూ. 1000 కోట్లు దాటిన ఒక్క తమిళ సినిమా కూడా లేదు. భారతదేశంలోని అతిపెద్ద చిత్ర పరిశ్రమలలో ఒకటి అయినప్పటికీ, ఆ ఇండస్ట్రీ నుంచి ఒక్క సినిమా కూడా 1000 కోట్లు సంపాదించలేకపోయింది. వెయ్యి కోట్లు సంపాదించే సినిమాను ఇవ్వాలన్నది తమిళ చిత్ర నటులు, దర్శకుల కల. ఇప్పుడు ఆ కలను నెరవేర్చే బాధ్యత సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2'పై ఉంది. 'జైలర్ 2' విడుదలై వారం రోజులు కాగా, ఇప్పటివరకు సుమారు రూ. 600 కోట్లకు పైగానే వసూలు చేసింది. తద్వారా ఒక వారంలో ఇంత భారీ మొత్తాన్ని వసూలు చేసిన మొదటి తమిళ చిత్రంగా రికార్డుల కెక్కింది. ఈ చిత్రం ఓటీటీకి రాకముందే, అంటే రాబోయే రెండు మూడు వారాల్లో మిగిలిన నాలుగు వందల కోట్లను సంపాదించే బలమైన అవకాశం ఉందని బాక్సాఫీస్ పండితులు విశ్లేషించారు. దీంతో, 'జైలర్ 2' 1000 కోట్లు వసూలు చేసిన తొలి తమిళ చిత్రంగా నిలిచే అవకాశం ఉంది.2023లో రిలీజైన జైలర్ సినిమాకు సీక్వెల్ గా జైలర్ 2 తెరకెక్కింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు ?600--650 కోట్లు వసూలు చేసింది. దీని కారణంగా, రెండవ భాగంపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. అందుకు తగ్గట్టుగానే ఈ క్రేజీ సీక్వెల్ బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టేస్తోంది. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం బడ్జెట్ సుమారు రూ. 300 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఎప్పటిలాగే రిటైర్డ్ జైలర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో రజనీకాంత్ యాక్షన్, స్టైల్, స్వాగ్ అభిమానులకు తెగ నచ్చేశాయి.

హౌస్ నెం. 47' ట్రైలర్ వచ్చేసింది.



విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, నారాయణమ్మ, మాలా పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు ఈ సినిమా నుంచి అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్ విడుదలైంది. గిలిగింతలు పెట్టే హాస్య సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన యాక్షన్, ఆసక్తికరమైన డ్రామాతో ఈ సినిమా ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకాన్ని 'ఆదర్శ కుటుంబం' ట్రైలర్ కలిగిస్తోంది. త్రివిక్రమ్ రచన, దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సినిమా ట్రైలర్.. ఆయన బలమైన రచనను, విలక్షణమైన కథా శైలిని మరోసారి చూపిస్తోంది. కుటుంబ వినోదానికి యాక్షన్ థ్రిల్లర్ అంశాలను జోడిస్తూ ఆసక్తిని పెంచుతోంది. కామెడీ, యాక్షన్, సస్పెన్స్‌లను చక్కగా మేళవించిన ట్రైలర్.. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమా ఉండబోతోందనే అంచనాలను పెంచుతోంది. విక్టరీ వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్, ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్‌తో ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆయన చూపించిన ఎనర్జీ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఆయన నటనకు తోడు ఆసక్తికరమైన కథనం, వినోదభరిత సన్నివేశాలు ట్రైలర్‌ను మరింత ఆకట్టుకునేలా చేశాయి. ఇక తమన్ అందించిన నేపథ్య సంగీతం ట్రైలర్‌కు అదనపు బలాన్నిచ్చింది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో తీవ్రతను పెంచుతూ, కథలోని ఉత్కంఠను మరింతగా ఎలివేట్ చేసింది.'ఆదర్శ కుటుంబం' ట్రైలర్ ఆవిష్కరణ వేదిక హైదరాబాద్ లోని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. "మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ లో ఈ వేదిక జరుపుకోవడం సంతోషంగా ఉంది. ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. మీ అద్భుతమైన స్పందన చూసి ఆనందంగా ఉంది. కాలేజ్ లైఫ్ లో నాకు ఎన్నో మెమోరీస్ ఉన్నాయి. ఈరోజులు మళ్ళీ రావు. మీరు కూడా మంచి మెమోరీస్ ఉండేలా చూసుకోండి. మీ కలను నిజం చేసుకోండి. కాలేజ్ అంటే డిగ్రీ, జాబ్ మాత్రమే కాదు.. మంచి క్యారెక్టర్ తో బయటకు రావాలి. అక్టోబర్ 30న మా సినిమా విడుదలవుతోంది. మీ అందరూ సినిమా చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను." అన్నారు.మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "ఈ సినిమా మీరు ఊహించిన పద్ధతిలో కాకుండా, వేరే డైరెక్షన్ లో ఉండే లాంటి అవకాశమున్న సినిమా ఇది. నార్మల్ రొమాంటిక్ కామెడీ కాకుండా వేరే వేరే అంశాలను కూడా డిస్కస్ చేయడం జరిగింది. క్రైమ్ కామెడీ లేదా బ్లాక్ కామెడీ అలాంటివి ట్రై చేశాము. నాకు, వెంకటేష్ గారికి కూడా ఇది ఫస్ట్ అటెంప్ట్. పని చేసేటప్పుడు ఈ సినిమా మా అందరికీ ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. మీక్కూడా నచ్చుతుందని ఆశిస్తున్నాను. అక్టోబర్ 30వ తారీఖున థియేటర్లలో కలుద్దాం. ఈ సినిమాలో పనిచేసిన అందరు టెక్నీషియన్లకు, నటీనటులకు, ముఖ్యంగా వెంకటేష్ గారికి కృతజ్ఞతలు. ప్రొడ్యూసర్ చినబాబు గారికి థ్యాంక్స్ చెప్పుకోవడమంటే ఫ్యామిలీకి థ్యాంక్స్ చెప్పుకోవడమే. ఆయన తరపున కూడా అందరికీ నేనే కృతజ్ఞతలు చెబుతున్నాను. అలాగే తమన్ అద్భుతమైన సంగీతం అందించాడు. ముఖ్యంగా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఫెంటాస్టిక్ జాబ్ చేశాడు. దాదాపు 7-8 పాటలు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ లో ఉంటాయి. త్వరలోనే రిలీజ్ చేయబోతున్నాం అవన్నీ.

హైకూ మనల్ని ఎగ్జైట్ చేసే సిన్సియర్ లవ్ స్టోరి.



ఏగన్, కోర్ట్ ఫేమ్ శ్రీదేవి, ఫెమినా జార్జ్ హీరో హీరోయిన్లుగా విజన్ సినిమా హౌస్ బ్యానర్‌పై రూపొందుతోన్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'హైకూ'.యువరాజ్ చిన్నసామి రచన, దర్శకత్వంలో డా. డి. అరుళానందు, మాథ్యూ అరుళానందు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అక్టోబర్ 23న మూవీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రిలీజ్ ప్రెస్‌మీట్‌కు ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్, డైరెక్టర్ రామ్ జగదీశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీదేవి మాట్లాడుతూ.. "ఈ సినిమా నా హార్ట్ కి చాలా బాగా కనెక్ట్ అయింది. ఈ సినిమా కథ వినగానే బాగా నచ్చి వెంటనే ఓకే చేశా. లవ్ లో ఉన్నా, రిలేషన్ షిప్ లో ఉన్నా, మ్యారీడ్ కపుల్ అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. లవ్ ఉన్న కాంప్లికేషన్స్ మొత్తం ఈ సినిమాలో చూస్తారు. ఏగన్ డౌన్ తో ఎర్త్. ఆయనతో కలిసి పని చేయడం హ్యాప్పీగా అనిపించింది. నన్ను చాలా కూల్ గా హ్యాండిల్ చేసిన డైరెక్టర్ గారికి చాలా థ్యాంక్స్. మా టీం మొత్తం కూడా ఎంతో సహకరిస్తూ పని చేశారు. ఇది నా ఫస్ట్ డెబ్యూ. మీరంతా అక్టోబర్ 23 న థియేటర్ లో ఎంజాయ్ చేయండి"" అన్నారు.హీరో ఏగన్ మాట్లాడుతూ.. "నేను ఇండస్ట్రీకి కొత్త. హైకూ సినిమా క్లోజ్ తో మై హార్ట్. బాగా కష్టపడి సినిమా చేశాము. ఈ సినిమాపై నేను చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాను. మ్యూజిక్ డైరెక్టర్ సిద్దు కుమార్

Edited,Printed,Published and Owend by CHITELA KRISHANA ,Printed at sravanthi prienters , rtc crss road ,Hyderabad-500001. Published at:4-80/1, VIKARABAD, Telangana.